క్లుప్తంగా

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

కల్లూరు: పేద విద్యార్థులకు ఉపాధ్యాయులు చేయూతనందించడం అభినందనీయమని కల్లూరు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ ఎంపీపీఎస్ (కల్లూరు రెగ్యులర్) పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కవిత, సలీం, సుబ్బయ్య విద్యార్థులకు ప్లేట్లు, కాపీ రైటింగ్ బుక్స్, నోటు పుస్తకాలు, స్కేలు తదితర సామగ్రిని అందించారు. ఆయా వస్తువులను ఎంఈఓ చేతుల మీదుగా పిల్లలకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులను ఎంఈఓ అభినందించారు. అనంతరం ఉర్దూ పాఠశాలను ఎంఈఓ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మృతిచెందిన రాజశేఖర రెడ్డి (ఫైల్)

కోడుమూరు రూరల్: గత ప్రభుత్వంలో కోడుమూరు ఎంఎల్‌ఓగా పని చేసిన కుందం రాజశేఖరరెడ్డి (33) సోమవారం తెలవారుజామున తన నివాసంలో గుండె పోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ సునీత, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ప్రవీణ్‌కుమార్, మండల కన్వీనర్ రమేష్‌నాయుడు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖరరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇక... 'హలో కేఎంసీ'

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హలో ఎంఎంసీ పేరుతో సాధారణ ప్రజలు తమ కాలనీ సమస్యలను ఎక్కడికి వెళ్లకుండా ఫోన్ ద్వారానే ఫిర్యాదు చేసి పరిష్కరించుకునే సౌకర్యాన్ని కల్పించినట్లు కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యలు, అంతరాయం, చెత్త సేకరణ, పూడిక తీత, వీధి దీపాలు, రోడ్డు మరమ్మతులు, ఫాగింగ్ వంటి సమస్యలకు 7422992299 అనే హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. నగర ప్రజల విలువైన సమయం వృథా కాకుండా సమస్యలను సులువుగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

బుక్కాపురం అరటి తోటల్లోకి చిరుత

మహానంది: మహానంది, తిమ్మాపురం గ్రామాల పరిధిలో కొద్దిరోజులుగా సంచరిస్తున్న చిరుత తాజాగా సోమవారం ఉదయం బుక్కాపురం సమీపంలోని అరటితోటల వైపు వచ్చినట్లు రైతులు తెలిపారు. గ్రామంలోని రైస్ మిల్లు సమీపం నుంచి వెళ్లే మార్గంలో ఉన్న అరటిపొలాల వద్ద చిరుత కనిపించినట్లు రైతులు చెప్పారు. నల్లమల సమీప గ్రామాల ప్రజలు చీకటి పడితే చాలు బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. మహానందిలోని దేవస్థానం కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతం శివారు వైపు ఇద్దరు మహిళలు బహిర్భూమికి వెళ్లగా చిరుతను చూసి పరుగులు తీసిన విషయం తెలిసిందే. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించే చర్యలు తీసుకోకపోతే మూడు గ్రామాల ప్రజలు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సోమవారం భోళాశంకరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. అనంతరం భక్తులు క్షేత్ర పరిధిలోని ఉపాలయాలు, శ్రీశైలంప్రాజెక్టును సదర్శించారు.

జనం గుండెల్లో వైఎస్సార్

- ఘనంగా వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి
- వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం
- వేడుకల్లో పాల్గొన్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్





సి.బెళగల్‌లో కేక్ కటింగ్‌లో పాల్గొన్న కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్ తదితరులు, గూడూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



కోడుమూరులో వైఎస్సార్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

సి.బెళగల్: మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి రాష్ట్ర ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడుగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ 75వ జయంతిని మండల వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ నేతలు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు, ప్రజా పరిపాలన, సంక్షేమ అంశాలను వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి, ఒకరికి ఒకరు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఎంపీపీ బొంతల మునెప్ప, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, నరసింహుడు, బాయికాటి మద్దిలేటి, మహానంది, గోపాల్, వెంకటేష్, రామకృష్ణ, హారున్‌రోషద్, ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎం బాష, సీబీ గోవిందరెడ్డి, తులసిరెడ్డి, మనోహర్‌రెడ్డి, పాండురంగన్న, ఇమ్మానియేల్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: మండల వ్యాప్తంగా వైఎస్సార్ జయంతి వేడుకలను సోమవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గూడూరులోని వైఎస్సార్ విగ్రహానికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి , ఆదిమూలపు సతీష్‌లు పూలమాల వేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్సార్ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధిని సాధించడం జరిగిందన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ గత ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి మేలు చేశామన్నారు. ప్రతి వర్గానికి ఏదో ఒక రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ వైఫల్యాలపై పోరాడతామని స్పష్టం చేశారు. చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, లక్ష్మన్న, పీఎస్ షఫి, ఎల్.వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ అబేలు, కౌన్సిలర్లు దస్తగిరి, విజయుడు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: ప్రజారంజకమైన పాలనను అందించి మహానేత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు కోడుమూరులో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. జలయజ్ఞం, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్మరణీయుడిగా నిలిచి పోయారన్నారు. మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, స్థానిక నాయకులు రవికుమార్‌రెడ్డి, లింగమూర్తి, కట్టెల శ్రీనివాసులు, లింగమయ్య, రాఘవేంద్ర, డిష్ రవి, హనుమంతు, కర్ణ, శివరాముడు, వీరన్న, మాసుంబాషా, వీర, మధు, గిడ్డయ్య, సూరి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి







పాణ్యం: భారీ కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, హుసేనాపురంలో నివాళులర్పిస్తున్న దళిత నాయకులు, పాణ్యం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాణ్యం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని వాడవాడలా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పాణ్యంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద మహానేత విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం ప్రాజెక్టులతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. గాలేరు–నగరితో రాయలసీమను సస్యశ్యామలం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు పాలం చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, నాయకులు కరుణాకర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, బాబు, సుధాకర్, ఎల్లగౌడ్, బొజ్జన్న, సుబ్బయ్య, బాషా, చాంద్‌బాషా, టైలర్‌బాషా, చికెన్‌వలి, ఈశ్వరయ్య, రోసి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కొండజుటూరు గ్రామంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహనేత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచిపెట్టారు. గోరుకల్లు జలాశయ నిర్మాత వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. నేడు ఆయకట్టు రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందుతున్నాయంటే ఆయన చలవేనన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం

వైఎస్సార్ జయంతి సందర్భంగా తమ్మరాజుపల్లెలోని విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు క్షీరాభిషేకం చేసి నివాళులు అర్పించారు. ఆయన పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి కంటే రెండింతల సంక్షేమాన్ని అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లపాటి వెంకటేశ్వర్లు, చల్లా మధుమూర్తి, జక్కుల వేదవ్యాస్, బత్తుల లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో చెరగని ముద్ర వైఎస్సార్

ఓర్వకల్లు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు అన్నారు. మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, కేతవరం గ్రామాల్లో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఓర్వకల్లులో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆయన హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, నాయకులు మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, జెల్ల కృష్ణ, సుధీర్, మద్దిలేటి, రాముగౌడు, శివన్నగౌడు పాల్గొన్నారు. అలాగే హుసేనాపురం ఎస్సీ కాలనీలో మాజీ సర్పంచ్ చిన్న అయ్యన్న ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. శరత్‌కుమార్, మద్దిలేటి, రంగడు, గోవింద్, మోహన్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.



ఓర్వకల్లులో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగనాథ్‌గౌడు



పాణ్యం: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజా సమస్యలను పరిష్కరించండి



సి.బెళగల్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: మండల ప్రజలు సమస్యలను అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ అనుపమ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని, తమకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో కంబదహాల్, ఈర్లదిన్నె, బ్యాతోలి, చింతమానుపల్లె తదితర గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. అదేవిధంగా కేవీపీఎస్ సభ్యులు మూతనాగన్న, సోమశేఖర్ తదితరులు వెల్దుర్తి మండలంలో దళితులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న వెల్దుర్తి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ.. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కార మార్గాలు చూడాలన్నారు. అలాగే అధికారులు తమ శాఖల పరిధిలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీఓ శకుంతల, ఏఓ మల్లేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ సుమంత్ తదితరులు ఉన్నారు.

తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

- సినిమా యాక్షన్ సీన్‌ను తలపించిన వైనం
- భయభ్రాంతులకు గురైన ప్రజలు



కోడుమూరులో ఒకరినొకరు తన్నుకుంటున్న టీడీపీ నాయకులు

కర్నూలు: కోడుమూరులో ఓ స్థల వివాదంలో టీడీపీ నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. తెలుగు తమ్ముళ్ల గొడవ ఆద్యంతం యాక్షన్ సినిమాను తలపించింది. సోమవారం రాత్రి సుమారు 20 మందికిపైగా తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకుంటూ, రాళ్లతో కొట్టుకుంటూ కోడుమూరు నడిబొడ్డులో, పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో బీభత్సం సృష్టించారు. తెలుగు తమ్ముళ్ల గొడవను చూసిన ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురై పరుగులు తీయగా, ఏమి జరుగుతుందో తెలియక వ్యాపారస్తులు దుకాణాల షట్టర్లు మూసి వేశారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి గొడవకు పాల్పడుతున్న వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు. ఈ గొడవకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖ నెలకొల్పిన టవర్లపై 33కేవీ లైన్ లాగే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంగళవారం కూడ టవర్‌లపై లైన్ లాగుతున్నందున వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ నాగప్రసాద్ తెలిపారు. బాబా బృందావన్ నగర్, కమాండెంట్ డీటీఆర్, 4వ పట్టణ పోలీస్ స్టేషన్, రాజీవ్ నగర్, నిర్మల్‌నగర్, గోపినగర్, వాసవి నగర్, మల్లారెడ్డి రిచ్‌మండ్, సన్‌రైజ్ ఓమ్స్, లక్ష్మిగ్రీన్‌సిటీ, గీతాంజలి వెంచర్స్, ఎమ్మెస్ నాయన అపార్టుమెంట్సు, గురు బ్రహ్మ నగర్ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాలికపై లైంగిక దాడి కేసులో వృద్ధుడికి జైలుశిక్ష



పోలీసుల అదుపులో పాపయ్య

కర్నూలు (హాస్పిటల్): నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి కేసులో 75 ఏళ్ల వృద్ధుడిక జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి జి. భూపాల్‌రెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే..నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం పశ్చిమ ప్రాత కోట గ్రామంలో 2020 నవంబర్ 18న నాలుగేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన నిందితుడు మద్రిమామ పాపయ్య అలియాస్ అలంపూర్ పాపయ్య లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తన ఇంటి బయట ఆడుకుంటుండగా వృద్ధుడు మాయమాటలు చెప్పి అతని ఇంట్లోకి పిలుచుకెళ్లి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. తర్వాత ఇంటికి వెళ్లిన బాలిక శరీరంపై దుస్తులు తిరిగేసి ఉండడాన్ని పిన్ని గమనించింది. విచారించగా బాలిక జరిగిన విషయం చెప్పింది. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ముచ్చుమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ శ్రుతి దర్యాప్తు చేసి నిందితుడిపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి తీర్పు వెలువరించారు.


ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గడివేముల: మండలంలోని ఎరువులు, పరుగు మందుల దుకాణాల్లో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ తనిఖీలు చేశారు. గడివేములలోని రాధా కృష్ణ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో సరైన రికార్డులు చూపకపోవడంతో రూ.17,280 విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. అదే విధంగా వెంకటేశ్వర ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులనే విక్రయించాలని తెలిపారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువగా విక్రయించరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేడు మార్కెట్ వేలంపాట

కోడుమూరు రూరల్: కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి 2024–25 సంవత్సరానికిగాను వారపు సంతమార్కెట్, దినసరి మార్కెట్, మాంసం మార్కెట్ నిర్వహణకు సంబంధించి మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్ సోమవారం తెలిపారు. 09–07–24 నుంచి 31–03–25 వరకు 9 నెలలపాటు ఆయా వ్యాపారాలకు సుంకం వసూలు చేసుకునే హక్కులకు వేలాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. వారపు సంత మార్కెట్‌కు రూ.3 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.3 లక్షలు, మాంసం మార్కెట్‌కు రూ.50 వేల చొప్పున దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని, వేలం దక్కించుకున్న వారు వెంటనే మిగతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



నాగమద్దిలేటి మృతదేహం

గడివేముల: అనారోగ్య సమస్యలకు తోడు కుమార్తెల పెళ్లిళ్లు ఎలా చేయాలోననే మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొరతమతి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నాగ మద్దిలేటి (42) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు ఎలా చేయాలని దిగులు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య సువేదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కంటైనర్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని నార్లాపురం స్టేజీ సమీపంలో జాతీయ రహదారి–44పై సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఇటుకల లోడుతో కర్నూలు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కంటైనర్ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రహదారిపై బోల్తా పడడంతో ఇటుకలన్నీ రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. కంటైనర్ సైతం డివైడర్‌పైకి ఎక్కింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. హైవే పెట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి పెంచాలని ఎంపీడీఓ మల్లీశ్వరి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణల పురోగతిపై హౌసింగ్ ఏఈ రామయ్యతో కలిసి ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు వంద రోజుల ప్రణాళికా చర్యలు చేపట్టాలని తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 619 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఐహెచ్‌హెచ్ఎల్ కింద మంజూరైన 945 ఇళ్లకు గాను ఇప్పటి వరకు 487 ఇళ్లు పూర్తి చేశామన్నారు. మిగతా 458 ఇళ్లు మూడు నెలల్లోగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకంలో 90 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. పీఎంఏవైజీ కింద మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇనుపకడ్డీ, ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- వీడిన హత్య కేసు మిస్టరీ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నల్లప్ప

పాణ్యం: మండలంలోని మద్దూరు గ్రామంలో ఈనెల 2వ తేదీ జరిగిన హత్యకు వివాహేతర సంబంధమే కారణమని సీఐ నల్లప్ప తెలిపారు. సోమవారం హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన దుదేకుల పెద్ద దస్తగిరి ఈ నెల 2వ తేదీ మద్దూరు బీసీ కాలనీలో గ్రామస్తులతో మాట్లాడుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన వల్లపు వడ్డే రామాంజనేయులు, నంద్యాల మండలం కొట్టాల గ్రామానికి చెందిన గోగుల హరి, పుట్ట శ్రీనివాసులు, పెద్ద కొట్టాలకు చెందిన పుచ్చకాయల రవితేజ ఏపీ39ఈడీ5474 నంబర్ గల కారులో గొడ్డలి, కత్తి, రెండు కర్రలతో పెద్ద దస్తగిరి ఇంటికి వచ్చి ఒక్కసారిగా అతనిపై దాడి చేసి హత్య చేశారు. మృతుడు పెద్ద దస్తగిరి పెద్ద కుమారుడు దుదేకుల మదర్‌షావలి అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని.. ఈ కారణంగా దుదేకుల పెద్ద దస్తగిరిని హత్య చేశారని సీఐ వెల్లడించారు. నిందితులను మద్దూరు– బ్రహ్మణపల్లె క్రాస్ రోడ్డులో అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి కారు, కత్తి, రెండు కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సకాలంలో స్పందించి నిందితులను పట్టుకునేలా చొరవ చూపిన కానిస్టేబుళ్లు నాగార్జున, వెంకటేశ్వర్లు, మన్సూర్‌లను అభినందించారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : ప్రజా సమస్యలకు సంబంధించిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. సోమవారం స్థానిక నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి నగరపాలక కమిషనర్ దరఖాస్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 39 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుడదని కార్యక్రమం పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ ఈ వేణుగోపాల్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఆర్ఓ జునీద్, మేనేజర్ చిన్నరాముడు, టిడ్కో అధికారి పెంచలయ్య, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఏసీపీ రంగస్వామి పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే...

- ధర్మపేట రైల్వే బ్రిడ్జి వద్ద మరుగుదొడ్లలో మరమ్మతులు చేపట్టాలని, దీపక్ ఆసుపత్రి వద్ద మురుగుకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని ధర్మపేట ఏరియా సంక్షేమ సంఘం నాయకులు విన్నవించారు.
- మమతనగర్‌లో తన ప్లాటుకు రీసర్వే చేయాలని సుబ్బయ్య అనే వ్యక్తి కోరారు.
- 45 వ వార్డు శ్రీకృష్ణ కాలనీలో, శ్రీనగర్ కాలనీ, కేసీ కెనాల్ వద్ద బోర్లు వేయించాలని స్థానిక కార్పొరేటర్ మాణిక్యమ్మ వినతిపత్రం అందజేశారు.
- వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్టీఆర్ బిల్డింగ్‌లలో మున్సిపల్ పైపులైన్ లీక్ అవుతుందని స్థానికులు కృష్ణకుమారి విన్నవించారు.
- సీజనల్ వ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి వినతిపత్రం అందజేశారు.
- టిడ్కో గృహం కోసం కట్టిన నగదును వెనక్కి ఇవ్వాలని బాలాజీనగర్‌కు చెందిన సిరి అనే మహిళ కోరారు.
- మారుతి నగర్, జ్యుడీషియల్ కాలనీలకు మధ్య ఉన్న పార్కుకు గేటు ఏర్పాటు చేయాలని స్థానికులు పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి కమిషనర్‌ను కోరారు.
- మున్సిపాల్టీలో నీటి ఫిల్లింగ్ రుసుం రూ.300 తగ్గించాలని జిల్లా ప్రైవేటు ట్యాంకర్స్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు.